

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 అక్టోబర్, 2022 సంచిక : 5

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

Online Donations :
SRI SAI SEVA SAMITHI TRUST
A/c No.62002652136
SBI Keesara Branch,
IFSC Code : SBIN 0020639

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
వ్యక్తి-సమాజం ........ 4
బాలవాణి ........ 6
విద్యను గూర్చి ........ 9
మంత్రం విలువ ........ 11
తెలియకచేసినా అధర్మం ........ 12
ఆస్తి ........ 16
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 22
శాశ్వత ధర్మగోప్త ........ 23
సాయిభక్త దాసగణు ........ 25
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 27
మాతృసంస్థ కబుర్లు ........ 30

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



ప్రియ పాఠక మిత్రులకు శుభాకాంక్షలు.

దీపావళి అక్టోబరు 24న వస్తున్నది. దీపావళి అనగానే మనకు దీపాల వరుసలతో అలంకరించుకొని మెరిసిపోయే ఇళ్లు, టపాకాయలు-మళ్లీ మాట్లాడితే పిండివంటలు, క్రొత్త బట్టలు వగైరా వగైరాలు గుర్తు వస్తాయి. మరి, అంతటి ఉత్సాహం కలగడానికి మూలకారణం ఏమిటి-ఇందులోనుండీ మనం ఏం నేర్చుకోవాలి? అని ఆలోచిస్తే మనకు ఎంతో చక్కని సందేశాలు అందుతాయి దీపావళి నుండీ. పండుగ ఎందుకు వచ్చిందో ఆ కథ-శ్రీకృష్ణుడు సత్యభామతో కలసి నరకాసురుని చంపిన కథ అందరికీ తెలిసినదే. ఇక్కడ సత్యభామ భూదేవి అవతారమని మనం గుర్తు చేసుకోవాలి. భూమి మురికితో నిండిపోతూ ఉంటుంది మాటి మాటికీ. (ఈ పుణ్యంలో చాలా భాగం మనిషిదే). అలా ఏర్పడిన మురికిని తొలగించుకొని, తిరిగి దానిని మట్టిగా మార్చి, తనలో లయింపజేసుకోగల శక్తి భూమికే ఉంది. నరకం అంటే మురికి అని అర్థం. నరకాన్ని నాశనం చేయగల శక్తి మాతృభూమికే, మాతృమూర్తికే ఉంటుంది. నరకుడు లోక కంటకుడు. అతడు తన కొడుకే, అయినాగానీ సత్యభామ నరకుని చంపడానికి వెనుకాడలేదు. లోకానికి కీడు చేసేవాడు కన్నబిడ్డైనా సరే-వాడిని తొలగించి వెయ్యవలసిందే. మమకారం కన్నా ధర్మం గొప్పది. అందుచేత తండ్రి విష్ణుస్వరూపుడైన కృష్ణుడు, తల్లి భూదేవి స్వరూపిణియైన సత్యభామా కూడా నరక సంహారానికి తలపడ్డారు.

అంతేకాదు-మనిషికి నిర్మలమైన చిత్తం, నిరహంకారమైన ఋజు ప్రవర్తన ఉంటే అతని జీవితం గొప్ప స్వర్గసీమగా మారుతుంది. కుత్సితబుద్ధి,

మితిమీరిన అహం, పరహింసా ఉంటే-ఆ మనిషి జీవితం అశాంతినిలయమై నరకం అవుతుంది. అంటే స్వర్గ నరకాలు మనలోనే ప్రభవిస్తుంటాయి, అంతరిస్తుంటాయి కూడా. నరకానికి జన్మస్థానం మన మనస్సే అయినపుడు దానికి మృత్యుస్థానం కూడా అదే కావాలి మరి! తల్లి నరకుడిని నాశనం చెయ్యడంలో గల రహస్యం అదే. మన పురాణాలు, పండుగలు ప్రతి దాని వెనుకా ఏదో ఒక నిగూఢతత్త్వం, రహస్యం ఉంటాయి. విజ్ఞానం, వైద్యం, తత్త్వం-అన్నింటి సమాహారంగా ఏర్పడ్డాయి మన ఐతిహ్యాలన్నీ. మాయను భగవంతుడే సృష్టించాడు. కానీ, అది ఎంత బలంగా తయారైందంటే-అప్పుడప్పుడు అది భగవంతుడిని కూడా వశపరచుకోగలదు. నిజంగా పరమాత్ముడు లొంగుతాడా? అన్నది ప్రశ్న. లొంగినట్లు కనిపిస్తాడు. అలాకాక ఆయన నిజంగానే లొంగిపోతే అందులో నుండి ఆయనను బయటకు లాగగలవారెవ్వరు? జీవుడు (సత్యభామ) అజ్ఞానంపైన (నరకాసురుడితో) యుద్ధం ప్రకటించి, తీవ్ర పోరాటం చేస్తున్నపుడు పరమాత్మ సాక్షీభూతంగా ఉండిపోతాడు. కడపటి క్షణంలో తన సాయం అందించి జీవుడిని మాయ నుండి ఇవతలకు లాగుతాడు. నరక చతుర్దశినాటి యుద్ధ రహస్యం ఇదే!

ప్రపంచంలో ఒక దుర్మార్గుడు మరణిస్తే, ప్రపంచమంతా ఆనందిస్తుంది. ఆనందించాలి కూడా. వాడి వలన మనకు బాధ కలుగుతుందా? లేదా? అన్నది కాదు. జనావళి హింసపడుతున్నారా? లేదా అన్నది ప్రధానం. నరకుని మరణానికి యావద్భారత భూమి స్పందించింది. అన్నేళ్ల చీకటి విచ్చిపోయినందుకు జనం ఆనందంతో పడుగ చేసుకున్నారు. దానికి చిహ్నంగా వేనవేల దీపాలు వెలిగించారు. మరి ఇప్పుడు మాత్రం మన చుట్టూ నరకాసురులు లేరా? వారి పతనానికి మనం సవ్యంగానే స్పందిస్తున్నామా? వందలాదిమంది ఆనందంగా విహరించే స్థలాలలో, భోజనశాలలలో, రైల్వేస్టేషన్లలో, చివరికి ఆస్పత్రులలో, చిన్నపిల్లల పాఠ





శాలల్లో అమానుషంగా బాంబులు పేల్చి వందలాది అమాయకుల ప్రాణాలను నిష్కారణంగా బలిగొన్న ఉగ్రవాదులకు సైతం కొమ్ముగాస్తున్నాం. ఇన్ఫార్మర్లనే పేరుతో అమాయకులైన వల్లీయులను, గిరిజనులను కూడా పొట్టన పెట్టుకునే కిరాతకులను ఏ పోలీసులో కాల్చి చంపితే అది అన్యాయమని అరుస్తున్నాం. అదే పునాదిగా మనవైన రాజకీయ సౌధాలను నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తున్నాము. అసలు బాధితుల పేర్లయినా ఎత్తని మనం, వారిని బాధించిన వాడి తాలూకు బంధుజనం ఎంతగా దుఃఖిస్తున్నారో ఫొటోలు వేసి మరీ ప్రచారం చేస్తున్నాము. యాసిడ్‌కో, కత్తిపోట్లకో బలియైన దురదృష్టవంతుల మీద కంటే, వారిని హింసించిన వారికి కఠిన శిక్షలు పడరాదని, వారి మీద ఎక్కువ సానుభూతులు ఒలకబోస్తున్నాం. పదిమంది సజ్జనులను కాపాడటానికి ఒక దుర్జనుణ్ణి తొలగించడం తప్ప కాదన్న ధర్మరీతిని, సామాజిక నీతిని మనం మర్చిపోతున్నాం. ఎటు నడుస్తున్నామో ఒక్కసారి విశ్లేషించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ పని చేద్దామా దీపావళినాడు!



# వ్యక్తి-సమాజం

**- పూజ్యశ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ**

శరీరము, మనస్సు, బుద్ధి, ఆత్మ-ఈ నాల్గింటి సమాహారమే వ్యక్తిత్వము. ఒక వ్యక్తి సుఖంగా వున్నాడని ఎప్పుడు అనగల్గుతామంటే-పై నాలుగు విధాలుగాను (శారీరకంగా, మానసికంగా, బౌద్ధికంగా, ఆత్మపరంగా) సుఖంగా ఉన్నప్పుడే. ఈ నాల్గింటిలో ఏదో ఒక్క దానిని గురించే ఆలోచిస్తూ, మిగిలిన వాటిని విస్మరించినట్లయితే మన ఆలోచన లోపభూయిష్టమవుతుంది, అసమగ్రమవుతుంది. మనం వ్యక్తి యొక్క సంతోషాన్ని గురించి ఆలోచించటంలో నాలుగు విధాలుగా ఆలోచించినట్లుగానే-

సమాజం యొక్క సంతోషం గురించి ఆలోచించే సమయంలోనూ పై నాలుగు విధాల సంతోషం ఉన్నదా లేదా అని ఆలోచించవలసి ఉంటుంది. సమాజం సుఖసంతోషాలతో ఉన్నప్పుడు మాత్రమే వ్యక్తికి కూడా సుఖసంతోషాలు లభ్యమవుతాయి.

వ్యక్తికి, సమాజానికి మధ్య ఉండే సంబంధం మిగిలిన అన్ని రంగాల కంటే విద్యారంగంలో స్పష్టంగా గోచరమవుతుంది. పిల్లవాడికి మాటలు నేర్పటంలో తల్లిదే ప్రథమ బాధ్యత అనటంలో సందేహం లేదు. అయితే తల్లి పిల్లవాడికి తమ చుట్టూ వున్న సమాజ వ్యవహారంలో ఉన్న మాటలే నేర్పుతుంది. కేవలం తనకు ఇష్టమైన మాటలు మాత్రమే నేర్పదు. పిల్లవాడు శైశవంలో, బాల్యంలో అలవరచుకొనే సంస్కారాలన్నీ సమాజం నుండే లభిస్తాయి. ఆ పిల్లవాడి తీరును బట్టి సమాజం అతడిని ప్రశంసించటమో, నిరసించటమో జరుగుతూ ఉంటుంది. మరో విషయమేమంటే సుఖ సంతోషాలు వైయక్తికమైనవి కావు. అవి సామూహికమైన భావనలు, సమాజం యొక్క స్థితిగతులననుసరించే మన ఆర్థిక, రాజకీయ, ధార్మిక నైతిక పురోగతి సాధ్యమౌతుంది గనుక వ్యక్తి తప్పనిసరిగా సామూహికమైన సుఖసంతోషాల గురించి, సామూహికమైన దుఃఖ విచారాల గురించి ఆలోచించటం నేర్చుకోక తప్పదు.

కౌరవసేనలో అనేకమంది అతిరథ మహారథులు ఉన్నప్పటికీ వారు ఎవరికీ వారు తమతమ వ్యక్తిగత నిష్ఠలకు, ప్రతిష్ఠలకు ప్రాధాన్యమిచ్చి వ్యవహరించారు. కాగా పాండవులు కలసికట్టుగా ఏకోన్ముఖులై, శ్రీకృష్ణుని నాయకత్వాన్ని అనుసరించి ముందుకు నడిచారు. అలా కలిసికట్టుగా, సమిష్టిగా బాధ్యతాయుతంగా ఉండటమే ధర్మం. అదే మాదిరిగా జాతీయ వాదం కూడా ధర్మమే. సమాజహితం కోసం అన్నిరకాల వ్యవస్థలనూ సర్దుబాటు చేసుకోవటం, సమన్వయించుకోవటం ధర్మం. యుద్ధంలో సైనికుడు విజృంభించి పోరాడుతూ శత్రుపక్షానికి చెందిన సైనికులను





చంపినపుడు అతనికి పరమ వీరచక్ర వంటి బహుమతులను ప్రకటించటం జరుగుతుంది. అదే సాధారణ జీవితంలో ఉండే వ్యక్తి మరో వ్యక్తిని చంపినట్లయితే, ఇతడిపై నేరవిచారణ జరిపి ఉరిశిక్షనో, యావజ్జీవ కారాగారవాస శిక్షనో విధించటం జరుగుతుంది. ఈ ఇద్దరు చేసిందీ మరో వ్యక్తిని చంపటమే అయినప్పటికీ - మొదటి వ్యక్తి తాను చేసిన పనిని సమాజం కోసం చేయగా, రెండవ వ్యక్తి తన వ్యక్తిగత ప్రయోజనం కోసం చేశాడు. అదీ ఈ ఇద్దరి కృత్యాల మధ్య ఉన్న తేడా. మన దేశంలో ఇప్పుడు అమల్లో ఉన్నది ప్రజాస్వామ్య వ్యవస్థ. ఇందులో అనేక రాజకీయ పక్షాలున్నాయి. అయితే ఇవన్నీ దేశం కోసమే ఉన్నాయి (ఉండాలి). మనం గనుక దేశాన్ని మరచిపోయి వ్యవహరించినట్లయితే, అప్పుడు మనం ఎంతో విలువైనవిగా భావించుకొనేవి కూడా తమ ప్రాధాన్యాన్ని కోల్పోతాయి. కాబట్టి జాతీయవాద భావావేశాన్ని నిరంతరంగా అలవరచుకోవటం మనకు ఎంతైనా అవసరం. అది ఉన్నప్పుడే మనం దేశం కోసం చేయ వలసిన పనులను చేయగలుగుతాం. మన కర్తవ్యాలను నెరవేర్చగల్గుతాం.



# బాలవాణి

- మాతాజీ

అనగనగా ఓ రాజు. తన చుట్టుప్రక్కల ఉన్న రాజ్యాలన్నిటినీ జయించి, సువిశాలమైన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకొని చక్రవర్తి అయిపోయాడు. తనకు ఎదురులేదన్న ఆత్మవిశ్వాసం పెరిగిపెరిగి అహంభావంగా మారి పోయింది. సమర్థుడైన పరిపాలకుడు కావటంతో అతనికి సమస్యలేవీ ఎదురుకాలేదు. అలా ఒకటి రెండేళ్లు గడిచేసరికి ఆత్మవిశ్వాసం కాస్తా అహంకారంగా మారింది. ఒకసారి అతనికి తన రాజ్యంలో ఉన్న ఒకానొక గొప్ప యోగిని గూర్చి తెలిసింది. ఆయన యోగశక్తిని గూర్చీ, ఆత్మ సంయమన శక్తి గురించీ, గడిచినవీ, రాబోయేవీ కూడా చెప్పగల శక్తిని

గురించీ విన్నాడు రాజు. అయితే ఆయన అడవులనూ, కొండ గుహలనూ వదిలి రారని కూడా తెలుసుకున్నాడు.

ఆయన రాజు. కనుక ధనానికీ, సౌఖ్యాలకూ లొంగని వారున్నారంటే ఆయన నమ్మలేడు. అంచేత ఎలాగో ఓలాగ ఆయనను తీసుకువచ్చి తన ఆస్థానంలో ఉంచుకొంటే తనకు న్యాయవిచారణ వంటి వాటిలో పనికి వస్తాడనుకొన్నాడు. తానే స్వయంగా వెళ్లి, ఆయనను ఒప్పించి తీసుకు రావాలనుకొన్నాడు. సరే-ఓ రోజు తన మంత్రినీ, కొందరు భటులనూ వెంట బెట్టుకొని అడవికి వెళ్లాడు. ఆ యోగీశ్వరుడు ఎక్కడో నట్టడవిలో ఓ కొండగుహలో తపస్సులో ఉన్నాడు. ఒంటికాలి మీద నిలచి చేతులు పైకెత్తి తీవ్ర తపస్సు చేస్తున్న ఆయనను చూడగానే రాజుకు తాను విన్న మాటల మీద నమ్మకం ఏర్పడింది. ఎలాగైనా ఆ మహాత్ముడిని తన ఆస్థానంలో ఉంచుకోవాలన్న కోరిక బలపడింది కూడా.

రాజు మెల్లగా వెళ్లి ఎదురుగా నిలబడ్డాడు. కొంతసేపు గడిచాక యోగి కళ్లు తెరచి, అతన్ని చూచి చిరునవ్వు నవ్వాడు. "ఎవరు నాయనా నీవు? ఏ పని మీద ఇక్కడిదాకా వచ్చావు?" అని అడిగాడు. రాజుగారి అహం కొద్దిగా దెబ్బతిన్నది. తాను నివసించే రాజ్యానికి ప్రభువునే తానెరుగడా!- అనుకున్నాడు. అంతలో మంత్రిగారు ముందుకు వచ్చి "వీరు ఈ రాజ్యానికి ప్రభువులు స్వామీ! తమ దర్శనం కోరి వచ్చారు" అని చెప్పాడు. 'అలాగా!' అంటూ, రాజువైపు చూచి, "ఏమి నాయనా! నీ పరిపాలన బాగా సాగు తున్నదా?" అని అడిగాడు. రాజు రవంత అహంతోనే "చిత్తం స్వామీ! పెద్దల అనుగ్రహం వలన నా ఖడ్గబలానికి శత్రురాజ్యాలన్నీ చిత్తయిపోయాయి. ఇలాంటి సామ్రాజ్యంలో మీ వంటి ధర్మపరులైన సాధువులు ఇలా కొండలూ, గుట్టలూ పట్టుకొని ఉండటం నాకు నచ్చలేదు. మీకొక మంచి భవనం, చుట్టూ తోట అవీ ఏర్పాటు చేస్తాను. మిమ్మల్ని తీసుకువెళ్లడానికే వచ్చాను. దయ చేయండి స్వామీ!" అన్నాడు.





యోగి నవ్వి "చెయ్యి చాపితే చెట్లు పండ్లనిస్తుంది. గొంతు ఎండితే వాగు నీరిస్తుంది. ఎండా, వానల నుండీ తలదాచుకోవడానికి ఈ గుహ ఆశ్రయం ఇస్తుంది. ఇంకొక భవనంతో పనేముంది!" అన్నాడు. దాని మీదట రాజుగారు ఎంతగానో బ్రతిమాలారు. తనకు యోగీశ్వరులంటే ఎంతో గౌరవమనీ, దగ్గరలో ఉంటే ప్రతిరోజూ దర్శనం చేసుకోగలుగుతాననీ-యింకా ఏమేమో చెప్పి చూచారు. యోగి మాత్రం ససేమిరా రానన్నాడు. రాజుకు పట్టరాని కోపం వచ్చింది. "మీరున్న యీ స్థలం నా రాజ్యంలోనిదే. నా మాటే ధిక్కరిస్తున్నారా?" అన్నాడు చాలా పదునుగా. యోగి ఏ మాత్రం తొణక్కుండా "నేనైనా, నీవైనా, ఎవరైనా ఉండేది భగవంతుని సామ్రాజ్యంలో" అన్నాడు. రాజు రెచ్చిపోయాడు. యోగిని బెదిరించాడు. బలవంతంగా లాక్కుపోతానని భయపెట్టబోయాడు. చివరికి చంపిపారేస్తే నీకు దిక్కెవ్వరని అరిచాడు. అతడు రెచ్చిపోయేకొద్దీ యోగికి నవ్వు వస్తోంది. చుట్టూ ఉన్న వారి గుండెలు దడదడలాడుతున్నాయి. చివరికి యోగి యిలా అన్నాడు -

"నీవు మహారాజువా? నా బానిసలకు బానిసవు నీవు". అందరూ ఉలిక్కిపడ్డారు. రాజు కత్తి దూయబోయి, కొద్దిగా తమాయించుకొని "ఎందుకలా అంటున్నారు?" అని అడిగాడు. "ఇందాకటి నుంచీ నీవు నన్ను బెదిరిస్తున్నావు. నీ మాట కాదన్నానని మండిపడు తున్నావు. అంటే క్రోధానికి లొంగిపోయావు. ఆ క్రోధాన్ని నేను ఎన్నడో లొంగదీసుకున్నాను. ఇప్పుడది నా బానిస. నా బానిసకు నీవు బానిసవయ్యావు గదా మరి! ఇక నీ మాట నేనెలా వింటాను?" అన్నాడు యోగి రాజు కళ్లలోకి సూటిగా చూస్తూ. రాజు ఒక్క క్షణం చకితుడైనాడు. తలవంచుకొని కొద్దిసేపు అలా నిలబడిపోయాడు. అటుపైన వంగి, యోగి పాదాలు తాకి, వెనుదిరిగి వెళ్లిపోయాడు.



# విద్యను గూర్చి

- శ్రీశ్రీశ్రీ స్వామీ హర్షానంద

లోకంలో జరుగుతున్న అవకతవకలన్నిటికీ విద్యే పరిష్కారం. స్వామి వివేకానంద చెప్పినట్లుగా ప్రస్తుత విద్యా విధానంలో తగిన మార్పులూ చేర్పులూ చేయవలసిన అత్యవసర సమయం ఆసన్నమైంది. రకరకాల విద్యా కమిషన్లు-కొఠారీ కమిషన్, రాధాకృష్ణ కమిషన్ వంటి సిఫారసు చేశాయో (ఈ కమిషన్ రిపోర్టులిప్పుడు ఆచరణ లేవు-కేవలం గ్రంథాలయాల్లో మూలుగుతున్నాయి) ఆ విషయాలను శ్రద్ధగా పరిశీలించి, తగిన విధంగా-నేటి స్థితిగతులకు అనుకూలంగా ఆచరణలోకి తేవాలి. డిగ్రీకి ముందరి విద్యార్హత వచ్చేదాకా దీన్ని రెండు విధాల నిర్వహించాలి.

మొదటిది-ఉద్యోగార్హత సాధించేటట్లుగాను, రెండవది స్వయంశక్తితో ధనార్జన చేసి కుటుంబపోషణ చేసేటట్లుగానున్ను, ఇలా చేస్తే విశ్వవిద్యాలయాల మీద చాలా వరకు ఒత్తిడి తగ్గుతుంది. ఉన్నత విద్యలు సాధించటంలోనూ, పరిశోధనా విషయాలలోనూ మరింత ప్రభావవంతమైన విధానాన్ని అనుసరించవచ్చు. ఒక్కసారి మౌలిక సంస్కరణను మనం సాధించగలిగితే-యువకులు ఎదుర్కొంటున్న చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. విద్యలోను-అటుపై ఉద్యోగావకాశాల్లోనూ ఎదుర్కొనబడే అనేక సమస్యలు అదృశ్యమౌతాయి. ఇది ప్రధానంగా ప్రభుత్వపు బాధ్యతే అయినప్పటికీ విద్యార్థిలోకం ప్రభుత్వం యీ విషయంలో నిర్మాణాత్మకమైన ఒత్తిడి తెచ్చి, ఇలాంటి ఆరోగ్యకరమైన సంస్కరణలు తేవచ్చు. ఇది విద్యార్థులలో వారి శక్తులను విద్యకు సంబంధించని చెత్త కారణాల కోసం వ్యర్థం కాకుండా చూస్తుంది. విజయాలు సాధించడానికి అడ్డదారులు తొక్కే దౌర్బల్యాన్ని ఆపుతుంది. మరి అవే కదా-యువతరాన్ని క్రమక్రమంగా ఆత్మహత్యలవైపు నెడుతున్నవి!





విక్టోరియా తరం నాటి ఆంగ్ల విద్యలో - అంటే నాటి నుండి నేటి వరకూ మనం అనుసరిస్తున్న మన విద్యా విధానంలో అత్యంత హానికరమైన లక్షణం ఒకటి ఉంది. అదేమిటంటే-ఆంగ్లేయులలో సహజంగా ఉండే ఆచరణాత్మకమైన వివేకం యీ మన విద్యలో లోపించింది. ఎ, బి అన్న రెండు అక్షరాలు రాగానే విద్యార్థిలో తానేదో బి.ఏ. అయిపోయినట్లు నిలువెల్లా గర్వం నిండిపోతోంది. తత్ఫలితంగా శారీరక శ్రమ తక్కువగా భావిస్తున్నాడు. గీత ద్వారా అత్యద్భుతమైన కర్మయోగాన్ని బోధించిన యీ గడ్డ మీదే ఎంత పతనావస్థ వచ్చి పడింది. లేకపోతే యీ నేల మీద నిరుద్యోగమన్నదే ఉండేది కాదు. ఇక్కడ ఆర్జనకు అంతులేనన్ని అవకాశాలున్నాయి. ఉదాహరణకు వడ్రంగులు, కుమ్మరులు, కంచరులు, రాతి కట్టుబడి కట్టే మేస్త్రీలు-ఇలాటి నిపుణుల అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ రంగంలో, పాడి పరిశ్రమలో, కోళ్ల పెంపకంలో - ఎన్నెన్నో అవకాశాలు. పాశ్చాత్య దేశాలలో పై రంగాలన్నిటిలోనూ విద్యావంతులే పని చేస్తారు. అక్కడ - తమ చేతులతో యీ పనులన్నీ చేయటం తప్పుగా, హీనంగా ఎవ్వరూ భావించరు. అందుచేత-మన యువకులంతా కూడా పై విద్యలన్నీ ఏదో ఒక ఔత్సాహిక కార్యం (హాబీ)గానైనా నేర్చుకోవాలి. తమ విలువైన కాలాన్ని వీధులలోను, సినిమాహాళ్లలోనూ గడపటం కాక యువత యీవైపు దృష్టి మరల్చాలి.

విద్యాసంస్థలలోకి రాజకీయాల ప్రవేశానికి అనుమతించటం, పెద్దలు దీన్ని వ్యతిరేకించటం, మానటం అన్నది కూడా యువత ఎదుగుదలకు ఒక సమస్యగా తయారైంది. రాజకీయ పార్టీలు, ఏ సిద్ధాంతాలు లేని వాటి నాయకులూ దీనికి ప్రధాన కారకులు. ఈ రాజకీయ నాయకుల బారినపడకుండా మన యువతకు సరైన పవిత్రమైన ఆలోచనా విధానాన్ని నేర్పవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పని చాలా పకడ్బందీగా, ఓజోవంతంగా జరగాలి.

# మంత్రం విలువ

ఒక మంత్రాన్ని అనేకసార్లు జపంలా చేస్తేనే ఫలితం ఉంటుందా? అంటే అవును ఏకాగ్రతతో అధికసార్లు ఆ మంత్రాన్ని పలకడం వల్ల ఆ తరంగాలు శక్తిని ఆకర్షించడం కొనసాగుతూ ఉంటుంది. ఒక బంధం మానవదేహం చుట్టూ ఏర్పడుతుంది. ఒక్కో బీజానికి ఒక్కో శక్తిని ప్రకృతి నుండి ఆకర్షించే గుణం ఉంటుంది. ఆ బీజాలను ఒకటితో ఒకటి సంపుటీకరణ చేసి ఒక మూలమంత్రంలాగా చేసి ఇచ్చారు మన మహర్షులు. వారు సాధన చేసి దాని యొక్క ప్రయోజనం పొంది దర్శించి అనుభవ పూర్వ కంగా ఇచ్చినవి మంత్రాలు. అవి ప్రతి అక్షరానికి లక్ష చొప్పున అక్షర లక్ష జపం చేస్తే తప్పక మంత్రం సిద్ధిస్తుంది. కనీసం లక్ష జపం చేయడం వల్ల వినియోగించుకునే అర్హత వస్తుందంటారు.

ఉదా : ఒక మురికిగుంటలో మురికినీళ్ళు ఉన్నాయి. రోజూ ఒక గ్లాసు నీళ్లు అందులో పోస్తే మురికినీళ్లతో చేరి స్వచ్ఛమైన గ్లాసు మంచినీళ్ళు కూడా మురికిగా మారిపోతాయి. కానీ ఈ గ్లాసు నీటి ద్వారా ఆ మురికి నీళ్లు స్వచ్ఛంగా మారవు. అదే మురికిగుంటలో ఒక వాటర్‌పైపుతో నీటిని ధారలాగా వదలండి. అందులో ఉన్న మురికి నీరు మొత్తం బయటకు వెళ్ళిపోయి ఆ మురికిగుంట మొత్తం మంచినీళ్ళ గుంటలాగా స్వచ్ఛమైన నీటితో నిండిపోతుంది.

శరీరాన్ని స్నానంతో శుద్ధి చేస్తున్నాము. అలాగే మనసుని బుద్ధి ద్వారా శుద్ధి చేయాలి. అంటే మంచి ఆలోచనలు అలవాటు అయితే మంచి ప్రవర్తన, మంచి ఆలోచన అలవాటు అవుతుంది. జన్మజన్మల కర్మను మంత్ర జపంతో శుద్ధి చేసుకోవచ్చు. ఆ జపం ధారలాగా సాగాలి. అప్పడే కర్మ అనే మురికి ఆ ధారలో కొట్టుకుపోతుంది, స్వచ్ఛత లభిస్తుంది.

భగవత్ నామ అనే శుద్ధ కీర్తనతో చేస్తే శరీరంలో ఉండే మలినాలు అంటే కామ, క్రోధ, మోహ, మద, లోభ, మాత్సర్యాలు అను చెడు గుణములు మనసు నుండి వెళ్లి మనసు శుద్ధి అవుతుంది. అందుకే నిత్యం స్వామి నామం జపం, లేక కీర్తన, లేక శ్రవణం చేస్తూ చెడుకు దూరం అవ్వాలి. భక్తునిగా మారి భగవత్ తత్త్వం ఏమిటో తెలుసుకోవాలి!

**- వాట్సప్ సేకరణ**





# తెలియక చేసినా అధర్మం నరకహేతువే

**- శ్రీ శివానంద మూర్తిగారి 'భారతీయత' నుండి**

ఒకనాడొక కుక్క శ్రీరాముని సభలోకి వచ్చి తనకు న్యాయం కావాలని కోరింది. బ్రాహ్మణులు నివసించే చోటికి తాను వెళ్లగా ఒక బ్రాహ్మణుడు తనను నిష్కారణంగా కొట్టాడని చెప్పింది. ఎందుకు కొట్టావని రాముడు ఆ బ్రాహ్మణుని అడుగగా ఆనాడు భిక్ష దొరకని కారణంగా తాను కోపంగా ఉన్నాననీ, ఆ కోపంలో తనకు అడ్డుగా వచ్చిన కుక్కను కొట్టిన మాట నిజమేననీ ఒప్పకొన్నాడు. పైగా-నేరం చేసిన బ్రాహ్మణుడు శిక్ష అడిగాడు. బ్రాహ్మణుడు దండనార్హుడు కాడని మంత్రులు, శాస్త్రవిధి తెలిపినారు. రాజు శునకం వేపు చూడగా ఆ శునకము రాముడితో ఇట్లన్నది-"రాజా! ఈ సమస్య విషయంలో నాదొక మనవి. అభ్యంతరం లేకపోతే నాకు సభలో ఇచ్చిన వాగ్దానాలననుసరించి వీనిని కాలంజెర క్షేత్రంలో ఒక మఠానికి లేక ధర్మాదాయ సంస్థకు కులపతిత్వము-అనగా యాజమాన్యమును ఇవ్వవలెను". 'ఈ కోరిక విన్న రాముడు ఆ బ్రాహ్మణుడికి ఆ కులపతి అనే అధికార పదవి ఇచ్చి సగౌరవంగా పంపించివేశాడు. శిక్షించబడటానికి బదులుగా పదవీ లాభం పొందిన ఆ బ్రాహ్మణుడు సంతోషించి వెళ్ళినాడు. సభలోని మంత్రులు ఆశ్చర్యపడి, 'ప్రభూ! తమరు చేసిన పనికి అర్థమేమి? దండనకు బదులుగా ఇతనికి వరము ఇచ్చినారు కదా? అని అడిగినారు.

రాముడు "మీరు గతితత్త్వజ్ఞులు కారు. (అనగా కర్మఫల పరిమాణము తెలిసినవారు కారు) అంటూ జరిగిన దానికి కారణమును తెలియజెప్ప' అని కుక్కను అడిగినాడు.

ఆ శునకమిట్లు చెప్పినది. "రాజా! మీరీ బ్రాహ్మణుడిని పంపించిన కాలంజెర క్షేత్రమందు నేను పూర్వము కులపతిగా ఉన్నవాడను. నా ఉద్యోగ ధర్మముననుసరించి దేవతలకు, బ్రాహ్మణులకు నివేదించగా మిగిలిన అన్నమును భుజించుట, దాసదాసీలకు ధనాన్ని పంచి ఇచ్చుట, దేవతా ద్రవ్యమును కాపాడుట, వినయశీలమును కలిగివుండుట, ప్రాణులకు హితవును జేయుట ఇవన్నియూ కలిగిన నేనే మరుజన్మనందు ఈ శునకమునై పుట్టినాను. అట్టి నాకే ఈ దుర్గతి తప్పనప్పడు, కలినుడు అయిన ఈ బ్రాహ్మణుడు ఆ ఉద్యోగము నిర్వహించి తనకు ముందటి ఏడు తరాలను రాబోయే ఏడు తరాలను కూడా పతితులను చేయగలడు. మంచిని కోరేవాడు, ఎన్నడూ కులపతిత్వాన్ని చేయకూడదు. పుత్రపౌత్ర బాంధవులతో సహా ఎవడు నరకానికి పోదలచుకున్నాడో అట్టివానికే దేవతలపైన, గోవులపైన, బ్రాహ్మణులపైన అధికారమివ్వవలె. తానే మరొకరికి దానమిచ్చిన ధనాన్ని తన వద్ద ఉంచుకొనుట, లేక బ్రాహ్మణ ధనమును, దేవతా ధనమును, స్త్రీల ధనమును తన వద్ద ఉంచుకొని వినియోగించునో అతడు సకుటుంబముగ నాశనమునే పొందగలడు. దేవ బ్రాహ్మణ ధనము అపహరించినవాడు, మనస్సులోని భావన చేత అపహరించినట్లయితే నరకము పొందగలడు. ఈ బ్రాహ్మణుడికి ఇంతకన్న వేరేమి శిక్ష కావలెను?" అని ఆ శునకము వివరించినది. రాముడా భాషణ విని ఆశ్చర్యము పొందెను. తర్వాత ఆ శునకము ఆత్మాభిమానము కలదీ, పూర్వజన్మ జ్ఞానము కలదీ అగుటచే వారణాసి వెళ్ళి ప్రాయోపవేశము చేసి శరీరమును విడిచింది. గతితత్త్వము ఎరిగిన వారెవరైన తాము ఇప్పుడాచరించే పనికి భవిష్యత్తులో రాబోయే ఫలాన్ని గూర్చి తప్పక





ఆలోచిస్తారు. నేడు మనకు సంప్రాప్తించిన ప్రజాధనము, దేవతా ధనము, ప్రజలు, వీటిపైన లభించిన అధికార విషయంలో-ధర్మం తెలిసి ఆచరించే వారైనప్పటికీ, భ్రమ ప్రమాదాల వలన అధర్మం చేయవచ్చు. అది నరక హేతువే.

అనగా కాలాంతరంలో దుఃఖాన్ని ఇస్తుంది. తానే కష్టపడి సంపాదించిన ధనంలో అడిగిన వారికి దానం ఇవ్వకపోతే అది పాపమేనని పెద్దలు చెప్పారు. అలాంటప్పుడు తనది కాని ధనం దుర్వినియోగం చేయడం కాని, తాను హరించడం కాని చేసినప్పుడు శిక్ష తీవ్రంగానే ఉండకలదు కదా! ప్రజలపైన, ప్రజాధనంపైన మనకధికారం సంప్రాప్తమవుతే దానికి మురిసిపోవడం అజ్ఞానం యొక్క లక్షణం. నిజానికి వివేకం కలిగినవాడు భయపడవలసిన విషయం ఇది. 'రాజ్యాంతే నరకం ధ్రువం' అని ఎప్పడో చెప్పనే చెప్పారు. ధర్మం తెలిసి జాగ్రత్తగా ఉన్నవాడు కూడా ఎప్పడైనా పొరపాటు వలన అయినా తప్ప చేయవచ్చు. ఏ కారణం చేతనైనా దుష్టుని శిక్షించకపోవచ్చు. తన కొడుకులే నేరం చేస్తే వాళ్ల అవినీతిని తాను ఉపేక్షించిగాని దాచిపెట్టిగాని రక్షించవచ్చు. తనకు అధికారాన్ని కట్టబెట్టిన అనుయాయుల దుర్మార్గాన్ని తాను ప్రోత్సహించవచ్చు. న్యాయంగా ఒకరికి చెందవలసిన ధనాన్ని లేక ఒక పదవిని, అధికారాన్ని వారికి ఇవ్వక, తాను అన్యాయం చేయవచ్చు. దేశంలోని ప్రజాధనాన్ని దేశానికి ఇవ్వక తాను అపహరించవచ్చు. ఇవన్నీ నిస్సందేహంగా నరక హేతువులే. ప్రభుత్వపు బొక్కసంలోకి వచ్చిన ధనము ప్రజలిచ్చినదే. ఆ ధనం వసూలు చేయడంలో కూడా ప్రజలను అక్కడక్కడా హింసించడమే జరగవచ్చు. అంతేకాక ఆ ధనాన్ని తానపహరించి అటు ప్రజలకీ, ఇటు ప్రభుత్వానికీ కూడా ద్రోహం చేసి ఉండవచ్చు. అట్టి ప్రభుత్వోద్యోగులు శిక్షార్హులే అయినప్పటికీ, వాళ్ళని తన అసమర్థత చేతనో, స్వార్థం చేతనో, స్వజనం అనే అభిమానం చేతనో శిక్షించకపోవడము, ప్రోత్సహించడమనే

పని చేసిన పాలకుడు, వాళ్ళ మహా పాపంలో భాగస్వామియై పరోక్షంగా కూడా పాపం మూటకట్టుకుంటాడు. ప్రజలకు దుర్మార్గుల వల్ల, దొంగ వల్ల జరిగే అపకారం కంటే - ఇలాంటి పరిస్థితులలో, దుష్ట పరిపాలకులు నడిపించే ప్రభుత్వం వల్లే ఎక్కువ పీడ కలుగుతుంది. నేడు మన దేశంలో అధికారంలో ఉండే వారి వల్ల, ప్రభుత్వ యంత్రాంగం వల్ల ఎటువంటి సహాయము లభించకపోగా, పీడ మాత్రము నిశ్చయంగా కలగడం మనం చూస్తూనే ఉన్నాము. వందలాది క్రొత్త క్రొత్త శాసనాలతో ప్రజల మీద నల్లేరు మీద బండిలాగ నడిచే ప్రభుత్వ యంత్రాంగం ప్రజలే దొంగలని భావిస్తూ-వారిని శిక్షించే నెపంతో పీడించడానికి ఆయుధమవుతున్నది. పన్ను కట్టని వాడిని లేక ధనం దాచాడని అనుమానించిన వాడిపై దాడి చేసి, హింసించి శిక్షిస్తున్న ప్రభుత్వం ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆ పౌరుడు పూర్తిగా పన్ను కట్టి ఉంటే ఆ ధనాన్ని మేము పూర్తిగా ప్రజల కొరకై వినియోగించేవాళ్లమా? అందులో ఎంత అపహరించబడుతున్నది? ఆ విధంగా సగపాలు కూడా ప్రజలకు ఉపయోగపడని పన్ను వసూలు ఎంతవరకు న్యాయము! అలాగ పన్ను కట్టకపోవడము ఎంతవరకు నైతికంగా నేరము? ఈ విధంగా ఆత్మవిమర్శ చేసుకున్నట్లయితే, స్వార్జితమైన ధనాన్ని పన్ను కట్టక దాచుకున్న వాడికంటే ప్రభుత్వమే ఎక్కువ నేరస్థుడై శిక్షార్హమవుతుంది! శాసనం చేయడం ప్రజల కోసం కాక ప్రజలపై సవారీ చేయడమే కాగలదు. నేటి మన దేశ పరిస్థితి ఇలాగే ఉంది. కేవలం ప్రజాసేవే ఉద్దేశ్యమయితే అధికారం కోసమని ప్రాకులాడేవారు ఇంత వ్యయప్రయాసలను భరించవలసిన పనిలేదు. అధికారం మంచికైనా, చెడ్డకైనా అవకాశమే. మనసున్నవారు అక్కడక్కడా లేకపోలేదు. ఆ కొద్దిమంది కూడా అధికారంలోకి రావాలంటే అనుకూల వాతావరణము నేడు లేదు. ఏ కొద్దిమందైనా అధికారంలో ఉంటే వారు చేయగలిగిన దానికంటే చేయలేక పోయినటువంటిదే అధికంగా ఉంటుంది. రాముడి





కాలంలో కొంత ధర్మజ్ఞానం ఉండి కూడా ప్రజాధనంపై అధికారాన్ని కొంత కాలం చేపట్టిన కారణంగా ఆ బ్రాహ్మణుడు శునకజన్మ ఎత్తినాడు. అధికార నిర్వహణలో మంచివారు కూడా మంచిని చేయలేకపోవచ్చు. అది తెలిసిన వారు పదవీ లాభానికి మురిసిపోరు. అది కోరరు కూడా. ఈ మాత్రం జ్ఞానం నేడు మన దేశంలో అనేకమందికి ఉన్నటువంటిదే. అయితే మనోనిగ్రహం కలిగి ఉండటం అరుదైన విషయం. నిన్న మొన్నటి దాకా ఆదర్శప్రాయులైన నాయకులు మన దేశంలో లేకపోలేదు. వారిని జనం మరువనూ లేదు. ఈ రామాయణం కథ, ప్రజాద్రవ్యాన్ని నిప్పులాగా చూచిన ఈ ఆదర్శనాయకులనే మనకు గుర్తు చేస్తుంది. వారి స్మృతి రాజకీయ నాయకులకూ, ప్రజలకూ స్ఫూర్తినివ్వాలని కోరుకుందాము.

# ఆస్తి

వాళ్లిద్దరూ మంచి స్నేహితులు. పెద్దయ్యారు, పెళ్లిళ్ళు అయ్యాయి, వాళ్లకు ఒకరు గోవింద్, ఇంకొంకరు శ్రీనాథ్. ఇద్దరి పుట్టిన ఊరు బాసర-అక్కడే చదువు, సంస్కారం నేర్చుకున్నారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం ఇద్దరికీ. గోవింద్ స్కూలు టీచర్, శ్రీనాథ్‌కి సెక్రటేరియట్‌లో ఉద్యోగం.. ఏరా అంటే ఏరా అనే సాన్నిహిత్యం వాళ్లది.

జీవితం మాత్రం శ్రీనాథ్‌ని కొంచెం డబ్బున్నవాడిగా మార్చింది. గోవింద్ పిల్లలకు చదువు చెప్పకుంటూ టీచర్‌గా ఉండిపోయాడు. అద్దె ఇల్లు, సిటీ బస్ ప్రయాణం మామూలు విషయం గోవింద్‌కి. కానీ ఎప్పుడూ తన స్థితికి బాధపడలేదు.

పెళ్లయిన తరువాత చాలా మార్పులు వచ్చాయి వాళ్ల జీవితాల్లో. గోవింద్ భార్య సరళ. పేదింటి అమ్మాయి. గోవింద్ మేనమామ కూతురే.

అందలం ఎక్కాలని ఆశ సరళకు కానీ తీరేదెలా? ఎప్పుడయినా సరళ హంగులు, ఆర్భాటాలు కావాలని అడిగితే నవ్వి ఊరుకునేవాడు గోవింద్. మన దేశంలో నూటికి 40 మందికి ప్రతిరోజూ తిండి లేదు. వాళ్లతో పోలిస్తే మనం నయమే కదా అంటాడు. పాపం సరళ కోరికలు తీర్చలేనందుకు కొంచెం బాధపడుతూ ఉంటాడు అప్పుడప్పుడు.

ఆడవాళ్లు తమ పక్కన వాళ్లతో పోల్చుకుని తమ జీవితాలలో లేనివి ఏమిటో ఇట్టే తెలుసుకుంటారు. వాళ్లకు ఉన్న గొప్ప విషయాలను మాత్రం అంతగా పట్టించుకోరు. ఇక్కడ కూడా అదే జరిగింది. సొంత ఇల్లు, సొంత కారు లేవని బాధ సరళకు.

శ్రీనాథ్ భార్య లక్ష్మి మంచి కుటుంబం నుండి వచ్చింది. దానధర్మాలు చేయటం అలవాటు. దైవభక్తి మెండుగా ఉంది. ఉన్న సంపదను చూసి మిడిసిపాటు లేదు లక్ష్మికి. లక్ష్మి సరళ కూడా స్నేహితులయ్యారు. ఇళ్లకు రాకపోకలు కూడా బాగానే ఉన్నాయి. లక్ష్మికి సరళ అమాయకత్వం బాగా నచ్చుతుంది. పిచ్చి పిల్ల, సంపదలు ఉన్నా, సఖ్యం మరియు సౌఖ్యం ఉండాలి జీవితంలో అదే చెప్పింది చాలాసార్లు. నువ్వెన్నయినా చెప్ప లక్ష్మీ డబ్బులున్న దారే వేరు, చిన్న చిన్న అవసరాలు కూడా తీర్చుకోలేని జీవితాలు ఎందుకు? ఎవరికి ఉపయోగపడినట్లు? రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి, నలుగురూ పెద్దవాళ్లయ్యారు.

అది ఆగస్టు నెల, ఆ నెలలో శ్రీనాథ్ రిటైర్ అవుతున్నాడు. మరుసటి నెల సెప్టెంబర్‌లో గోవింద్ రిటైర్మెంట్.

ఆగస్టు 31వ తారీకు రానే వచ్చింది. శ్రీనాథ్, లక్ష్మి ఇంటికి వచ్చి మరీ పిలిచారు. రిటైర్మెంట్ ఫంక్షన్‌కి రావాలని, పిలవకపోయినా గోవింద్ వెళ్తే వాడే. ఇప్పుడు సరళ కూడా వెంట వెళ్లింది. శ్రీనాథ్ యూడీసిగా రిటైర్ అయ్యాడు. ఫంక్షన్ బాగా జరిగింది సెక్రటేరియట్‌లో వాళ్ల డిపార్టుమెంట్‌లో.





చాలామంది శ్రీనాథ్‌ని మెచ్చుకున్నారు. మంచివాడు, పనిలో చురుకుదనం చూపించేవాడని, అతను రిటైర్ అవటం డిపార్టుమెంట్‌కి తీరని లోటుగా గుర్తు చేసుకున్నారు.

స్నేహితుడి తరపున గోవింద్ మాట్లాడాడు. మరో జన్మంటూ ఉంటే శ్రీనాథ్‌కి మళ్లీ స్నేహితుడుగా పుట్టాలని, స్నేహానికి ప్రాణం ఇచ్చే శ్రీనాథ్ తనకు తన కుటుంబంలో మనిషని చెప్పాడు. అందరూ ఆనందించారు.

ఆ రాత్రి దగ్గర్లో ఉన్న కామత్ హోటల్‌లో భోజనం చేశారు శ్రీనాథ్, గోవింద్ కుటుంబాలు... చాలా రోజుల తరువాత సరళ బయట భోజనం చేసింది. ఆమెకు నిజంగా అసూయగా ఉంది. శ్రీనాథ్‌ది మంచి ఉద్యోగం, రిటైర్మెంట్ ఫంక్షన్ బాగా చేసారు, అందరూ పొగిడారు ఆయనను.

వచ్చే నెలలో తన భర్త గోవింద్ రిటైర్మెంట్ ఉంది. మామూలు స్కూలు టీచర్‌గా చేరి ఇప్పుడు ఒక స్కూల్ హెడ్మాస్టర్‌గా రిటైర్ అవుతున్నాడు. అప్పుడు ఫంక్షన్ ఎలా జరుగుతుందో ఏమో? శ్రీనాథ్ రిటైర్మెంట్ ఫంక్షన్‌లా ఆర్భాటంగా ఎలాగూ జరగదు... కనీసంలో కనీసం తలదించుకోకుండా జరిగితే చాలు .. అలా చాలామంది దేవుళ్లకు మొక్కింది.

రిటైర్మెంట్ రోజు దగ్గర పడుతున్న కొద్దీ సరళలో ఆందోళన పెరిగిపోతూ వచ్చింది. ఇద్దరూ వెళ్లి శ్రీనాథ్‌ని, లక్ష్మినీ పిలిచారు ఫంక్షన్‌కి. మనసులో మాత్రం, న్యూనతా భావం నిండి ఉండటం వలన, సరళ వాళ్లు రాకపోతే బాగుండునని చాలాసార్లు అనుకుంది. గోవింద్ మాత్రం మామూలుగానే ఉన్నాడు. మామూలు రోజుల్లాగే రిటైర్మెంట్ రోజు వచ్చింది.

ఆ రోజు మామూలుగా స్కూలుకి వెళ్లి కొన్ని క్లాసులు కూడా తీసుకున్నాడు పిల్లలకు. అదే తన ఆఖరి క్లాసు కావటంతో రుద్ధమైంది ఆయన గొంతు. కష్టం మీద క్లాసు కానిచ్చి స్టాఫ్ రూముకి వచ్చాడు గోవింద్.

సాయంత్రం నాలుగు గంటలయ్యింది. ఆ పాటికే సరళను, పిల్లలను

తీసుకుని శ్రీనాథ్ వాళ్లు కూడా స్కూలుకి వచ్చారు. శ్రీనాథ్‌కి చాలా సంతోషంగా ఉంది. గోవింద్ రిటైర్ అవుతున్నాడు. వాడూ, తను కలిసి ఎన్నో కబుర్లు చెప్పకుంటూ కాలం గడపాలి, ప్లాన్ వేసుకున్నాడు. సరళకు బెంగగా ఉంది. ముళ్ల మీద కూర్చున్నట్లు ఉంది తనకు. ఫంక్షన్ త్వరగా అయిపోతే బాగుండును, అనుకుంది.

తలవొంపులుగా ఫంక్షన్ జరుగుతుంది. తను తట్టుకోలేదు. మామూలు స్కూలు టీచర్ రిటైర్ అయితే కొన్ని వేలమంది, లక్షల మంది టీచర్లు ఉన్నారు భర్తీ చేయటానికి.. టీచర్ రిటైర్మెంట్ అంత గొప్ప విషయం కాదు. తొందరగా ముగించి ఇంటికి చేరుకోవాలని ఆరాటం సరళకు. పిల్లలు కూడా వచ్చారు తండ్రి రిటైర్మెంట్ చూడటానికి.

సరళ వాళ్లను స్టాఫ్ రూంలో కూర్చోబెట్టారు మిగతా టీచర్లు. అప్పటి వరకూ పెద్దగా జనం లేరు, విద్యార్థులు, టీచర్లు అందరూ కలిసి ఒక వంద మంది ఉంటారు. వాళ్ళు రోజూ స్కూల్లో ఉండే వాళ్లే కదా, సరళకు పెద్దగా సంతోషం కలగలేదు, ఇంకో పది నిముషాలకు ఫంక్షన్ మొదలవుతుందనగా, ఎక్కడి నుండి వచ్చారో దాదాపు ఇంకో వంద మంది పైనే జనం వచ్చారు, వాళ్లు పిల్లల బంధువులని తెలిసింది.

ఫంక్షన్ ఆరు బట చెయ్యాలని నిర్ణయం చేశారు, అందరూ కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు, చాలామంది నుంచునే ఉన్నారు, ఫంక్షన్ అయ్యేంత వరకూ.

ఎక్కడ నుండో పల్లకీని తీసుకువచ్చారు, మాస్టారు గోవింద్‌ను పిల్లలు పల్లకీలో కూర్చుండబెట్టారు. కొంతమంది టీచర్లు, పిల్లల బంధువులు పల్లకీ మోయటానికి సిద్ధపడ్డారు. సరళకు అంతా కలగా ఉంది. పల్లకీలో గోవింద్‌ని కూర్చోబెట్టి లేపబోతుండగా ఎవరో అరిచారు. మాస్టారి గారి ధర్మపత్నిని కూడా పల్లకీలో కూర్చోబెట్టాలని అందరి బలవంతం మీద





పల్లకీలో కూర్చుంది సరళ. గోవింద్‌లో పెళ్లిరోజు తరువాత మళ్లీ ఇన్నాళ్లకు పల్లకీలో ఎక్కడం, సరళకు సంతోషంతో కళ్ల వెంట నీళ్లు వచ్చాయి.

పల్లకీ లేచింది. చిట్టి చేతులతో పిల్లలు కూడా పల్లకీ మోస్తున్న వాళ్లకు సాయపడుతున్నారు. ఆ దృశ్యం మనోహరంగా ఉంది. కాలం కొన్ని క్షణాలు అలా ఆగిపోతే బాగుండనని అనిపించింది సరళకు. గోవింద్‌కి బాధగానూ, సంతోషంగానూ ఉంది. పిల్లలూ జాగ్రత్త.. మీరు ఇబ్బంది పడకండి అంటూ వాళ్లను వారిస్తున్నాడు. అయినా వాళ్లు వినటం లేదు.

ఇంతలో పల్లకీని దింపారు, ఎందుకో అర్థం కాలేదు సరళకు, గోవింద్‌కు. కారు దిగి నెమ్మదిగా వచ్చి నమస్కారం చేస్తూ ఆ వచ్చినాయన గోవింద్ కాళ్లకు దండం పెట్టాడు. ఆ వచ్చినాయన జిల్లా ఎస్పీగారు. వెంట పదిమంది పోలీసులు. ఈ లోపల ఇంకో కారు వచ్చి ఆగింది. వచ్చింది జిల్లా జడ్జీగారు. ఆయన కూడా తన వాళ్లతో వచ్చారు.

జిల్లా ఎస్పీ, జడ్జీగారు, మిగతా వాళ్లు పల్లకీ మోస్తుండగా నిర్ణీత స్థలానికి చేరారు. నీళ్లు, కాళ్ళు కడిగే ఇత్తడి పళ్లెం వచ్చాయి. ఎస్పీ, జడ్జీగార్లు గోవింద్ మాస్టారి కాళ్ళు కడిగి తల మీద చల్లుకున్నారు. కొంతమంది ఆడవాళ్ళు హారతి ఇచ్చారు గోవింద్, సరళలకు. ఆ రోజు పూలవాన కురిపించారు అందరూ వారిద్దరి మీద.

పిల్లలు మాస్టారు గోవింద్‌గారి గురించి మాట్లాడుతూ ఏడ్చేసారు. ఇంచుమించు టీచర్ల పరిస్థితి కూడా అంతే. అందరి కళ్ళు చెమ్మగిల్లాయి. జిల్లా ఎస్పీ, జడ్జీ కూడా మాట్లాడారు. తమ జీవితంలో తాము సాధించిన విజయాలు అన్నీ గోవింద్ మాస్టారి వలనే అని గర్వంగా చెప్పారు. ఆయన పక్కన కూర్చోవటం కూడా వాళ్లకు మనస్కరించక నుంచునే ఉన్నారు చాలాసేపు. అప్పటి వాతావరణం చెప్పటం కష్టం. శ్రీనాథ్ సంతోషం చెప్పనలవి కాదు. తన స్నేహితుడికి జరుగుతున్న గొప్ప గౌరవం అది. వాడికి జరిగినా తనకూ జరిగినట్లే. శ్రీనాథ్ మాట్లాడుతూ చెప్పాడు. ఇక్కడున్న

ఇన్ని వందల మందిలో తానొక్కడే గోవింద్‌ని ఆప్యాయంగా ఒరేయ్ అని పిలువగల అర్హత కలవాడవటం సంతోషంగా ఉందని అన్నాడు.

చివరగా గోవింద్ మాట్లాడాడు- పిల్లలందరికీ నా ఆశీస్సులు. ఒకప్పటి నా విద్యార్థులు ఈనాడు జిల్లా కలెక్టర్‌గానూ, ఎస్పీగానూ ఉండటం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఇలా పిల్లల్ని మంచి ఉన్నతస్థితిలో చూడటం తనకు గర్వకారణం అనీ, ఈ పిల్లలే తన ఆస్తి, ఐశ్వర్యం, వీళ్లే నా సర్వస్వం అంటూ మాట్లాడలేకపోయాడు.

నాకు ఇంత గొప్పవరం ఇచ్చిన భగవంతుడిని కోరేదొకటే అన్నాడు- నా పిల్లలందరికీ మంచి భవిష్యత్తును, దీర్ఘాయువును ఇమ్మని కోరాడు. పిల్లలను పట్టుకోవడం ఎవరితరం కాలేదు, అంతలా అభిమానించారు గోవింద్ మాస్టారును.

ఫంక్షన్ ముగిశాక అందరూ కలిసి వచ్చి గోవింద్‌ని ఇంటివరకూ దిగబెట్టారు. వెళ్లలేక వెళ్లారు పిల్లలందరూ.

ఆరోజు రాత్రి శ్రీనాథ్, లక్ష్మి, వారి పిల్లలూ గోవింద్ ఇంట్లోనే ఉండిపోయారు. భోజనాలు అయిన తరువాత గోవింద్ పాతికేళ్ల కొడుకు సుబ్రహ్మణ్యం, తల్లితో అన్నాడు - నాన్నగారికి ఇంత ఆస్తి ఉందని నాకు ఇంతవరకూ తెలియదమ్మా - నాకూ ఇంతవరకూ తెలియదురా అన్నది సరళ ఎంతో సంతోషంగా ...

శ్రీనాథ్ కల్పించుకుని అన్నాడు-వీడు కుబేరుడికి ఏం తీసిపోడు, మనఃస్ఫూర్తిగా చెపుతున్నాను.

సరళ గోవింద్ వంక చూసింది, గోవింద్ మనకు ఈ సంపద చాలు సరళా ఈ జన్మకు అన్నాడు.

ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది. గురువులు, పూజ్యనీయులు వారు ప్రోగుచేసుకున్న ఆస్తి పిల్లల అభిమానమే అన్నట్లుగా.

**- కోసూరి లక్ష్మణరావు (వాట్సప్ సేకరణ)**





## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

## సదా భజో గురుదేవ

సదా భజో గురుదేవ గురు బిన నహి కోయి అపనా
నాతే గోతే సబ్ స్వారథ్‌కే నిస్వారథ గురు రాణా
ఆప్ సమాన్ కరే శిష్యన్‌కో దేవే పద నిరబానా ॥ సదా ॥
కరే లోహ కా పారస సోనా నహి పారస కర జానా
నహీ ఉపమా గరుకీ త్రిభువనమే సాక్షాత్ దేవ పిఛానా ॥ సదా ॥
పూఛో పండిత్ పోథీ దిఖావే కాజి కితాబ్ కహెన
బోలే అంధా దౌడో పీఛే సబ్ మతలబ్‌మే స్యానా ॥ సదా ॥
కథే జ్ఞాన్ ఔర్ క్రియా సిఖావే పకడ్ దస్త్ సలూనా
ఘాట్ ఆగమ్ పే ఆప చఢావే జహాం సాయికా థానా ॥ సదా ॥
బినా తేల్ జలే జహాం జ్యోతి జగమగ దివసారైనా
ఆఠో యామ్ బజే సురబాజా రంగ్ అరంగి జానా ॥ సదా ॥

## హరిద్వార్, మథురా, కాశీ

హరిద్వార్, మథుర, కాశీ షిరిడీ మే తీర్థ సారే హై
సాయి బాబాకే చరణోమే చారో ధామ్ హమారే హై ॥ హరి ॥
సబ్ సంతోమే మహాసంత్ సాయి దునియాసే నారేహై
నరనారీ బాలక్ బుఢే సబ్‌హీ కో సాయి ప్యారే హై
మూరఖ్ హెూ యా అజ్ఞానీ, పండిత్ హెూ, చాహె విద్వాన్
ఏక్ నజరసే దేఖే సాయి సబ్‌కో దేతె హైం వరదాన్
కౌన్ బిగాడ్ సకే ఉసకా జినకే సాయి రఖవాలే హై
సాయి బాబా కే చరణో మే చారోం ధామ్ హమారే హై ॥ హరి ॥

**(సశేషం)**



## శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త

- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

ఈ సుదీర్ఘమైన ప్రయాణం స్త్రీలతో కూడిన పని. పది, పదిహేనేండ్ల నుండి చెరసాల జీవితంలో అలసి, చితికిన బ్రతుకులు. కృష్ణుడు సాత్యకిని వెంటనే ప్రయాణం చేయించాడు. దారిలో ఈ దళాలు విశ్రాంతి తీసుకునే స్థలాలను నిర్ణయించారు. ఆ స్థలాల ప్రభువులను శ్రీకృష్ణుని పేర, ఆ స్త్రీలకు భోజనాది సదుపాయాలు చేయమని అభ్యర్థిస్తూ ముందుకుసాగాలి. వీరికి ప్రభాసక్షేత్రంలో సోమనాథ పవిత్ర ప్రాంగణంలో శిబిరాలను ఏర్పాటు చేయాలి. బండ్ల ప్రయాణం కనీసం మణిపుర, విదేహ, చేది, మిథిల, దశార్ణవ రాజ్యాలలోంచి సాగాలి. ఆ ప్రయాణపు దారులలో గల ప్రభువులను పథరక్షక దళాలను నియమించమని ప్రార్థించాలి. ద్వారకకు వెళ్ళగానే సత్యభామ సోదరుడు భంగాకరుణ్ణి కలిసి, సత్యభామ సందేశపత్రాన్ని అందజేసి, రెండు నెలల్లో, పైన దారుకావన నాగనాథం నుండి, క్రింద ప్రభాసం వరకు నాలుగువేల వసతులను, ఒక్కొక్క వసతిలో నలుగురుండే టట్లు యుద్ధ ప్రాతిపదిక మీద సదుపాయాలతో ఏర్పాట్లు జరగాలి. తన విన్నపంగా ఉగ్రసేన, వసుదేవులకు, బలరాముల వారికి, మిగతా యాదవ రథ మహారథులకు ఈ పనిని మహాయుద్ధ ప్రాతిపదిక మీదనే జరగాలని శ్రీకృష్ణుడు సందేశం పంపాడు. సౌరాష్ట్ర స్థపతులే కాదు, నాగకూటం నుండి స్థపతులను రప్పించుకొమ్మని సలహా పంపాడు.

ఉగ్రసేనునికి పంపిన ప్రార్థన పత్రంలో 'మహారాజా! యాదవులు ప్రస్తుతం ఆర్యావర్త భవిష్య నిర్మాతలవుతున్నారు. మన శ్రమ వృధా కారాదు. నరకుని సంహరించడం ఒక ఎత్తు. వారి చెర నుండి పదహారు వేల మంది స్త్రీలను, ఆ రాజ్యంలోని గోవులను శ్రోత్రియులను, కర్మజీవులైన





ప్రజలను కాపాడడం మరొక ఎత్తు. తిరిగి గురుకులాలను, ఆశ్రమాలను, శ్రుతి సమ్మత జీవితాన్ని నడుపుకునే అభయం ఇచ్చి, రక్షణ చేకూర్చడం యాదవులు సాధించిన మహా విజయం. తమరూ, పూజ్యులు నాయన గారు, బలరామన్న, సుధర్మలో యాదవులను సమావేశపరచి, ఈ మహత్కార్యాన్ని సఫలం చేయమని ఉద్బోధించండని ప్రార్థించాడు.

మధుర నుంచి ద్వారకకు ఆనాడు యాదవులను నడిపించినవాడు, నేడు ప్రాగ్జోతిషం నుండి నాలుగు వేల బండ్లలో ఎనిమిది దళాలుగా వారానికొక దళంగా నడిపించిన మహాయాత్ర. తమసా నదిలో స్నానమాడి, కామాఖ్యదేవికి దోసిళ్ళనొగ్గి ఆ అబలలు, ప్రయాణం సాగించారు. కృష్ణుడు వారిని ప్రభాసంలోనే కలుసుకుంటారు. వారికి మీరు అభయం ఇచ్చి పంపరాదా' అని సత్య అడిగింది.


'సత్యా! పెద్దల అనుమతి లేనిదే ఇంత పెద్ద బాధ్యతను ఇక్కడే అంగీకరించడం ధర్మం కాదు. వారిలో ఏకాంత భక్తి భావం దృఢం కావాలి. తప్తలోహంవలె వారి హృదయాలు కరిగితే అప్పడు సమర్పణ భావన బలపడుతుంది' అన్నాడు కృష్ణుడు.

నరకాసుర వధ యావదార్యావర్తంలో అద్భుతమైన మార్పును తెచ్చింది. వారిని ద్వారకకు తీసుకొనివెళ్ళే నిర్ణయం అనూహ్యమైన ఫలితాన్ని ఇచ్చింది.

దారివెంట సాగిన ఆ బండ్లు వాసుదేవ సంకీర్తనతో కామాఖ్య నుండి భక్తి జాహ్నవిని ప్రవహిస్తూ సాగింది. ఏకభుక్తలు, కషాయాంబరధారిణులు, నిరాభరణలు, నుదుట కస్తూరి దిద్దుకొని నిరంతరం ప్రభు నామ స్మరణ చేస్తూ ప్రయాణిస్తున్న ఆ నారీమణులకు దారి కిరువైపులా ప్రజలు జేజేలు పలికారు.

వారందరూ నరకుని చెరసాల లోంచి బైటపడ్డారట! శ్రీకృష్ణుడే స్వయంగా వారిని రక్షించి అండగా నిల్చున్నాడట. ఆయనే వాళ్ళకు సర్వమూ-సాక్షాత్తు వాసుదేవ ప్రభువే వారికి భర్త, త్రాత, సర్వమూను.

**(సశేషం)**



# సాయి భక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

ఆకర్షణీయమైన రూపం, అద్భుతమైన వాక్చాతుర్యం, అమోఘంగా గాయనం, అకృత్రిమమైన భక్తి ప్రపత్తులు, అప్రతిమమైన (బాబా) సేవా నిరతి మరియు బాబా దర్శనానికి వచ్చే భక్తుల బాగోగుల పట్ల ఆమె చూపే అపురూపమైన శ్రద్ధ, అపూర్వమైన రీతిలో బాబా లీలలను హృదయానికి హత్తుకుపోయే విధంగా ఆమె వర్ణించే తీరు వంటి వాటి వలన ఆమె అంటే అందరికీ ఇష్టం, గౌరవం. అందువలన ఆమె ఇల్లు ఎప్పుడూ భక్తులతో కిటకిటలాడిపోయేది. ఒక్కొక్కసారి ద్వారకామాయిలో కంటే ఆమె ఇంట్లోనే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండేదని శ్రీ బి.వి. దేవ్ తమ స్మృతులలో చెపుతారు. అలా వచ్చిన భక్తులకు వివిధ సేవలను పురమాయిస్తూ, ఒక విధంగా శిరిడీ సంస్థాన్ నిర్మాణ కార్యంలో ఆమె నిమగ్నమై ఉండేది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఇదంతా ఆమె తన స్వార్థం కోసం చేయకుండా, తన ప్రభువుకు (బాబాకు) వైభవం ఇనుమడింపజేయాలనే ఉద్దేశ్యంతోనే ఆమె చేసేది. కేవలం బాబా పట్ల అనిర్వచనీయమైన అవర్ణనీయమైన భక్తి ప్రేమలతోనే ఆమె ఇదంతా చేసింది. ఒక విధంగా పండరీపురంలో పాండురంగ విఠలునికి ఏ సేవలు, పూజలు జరుగుతున్నాయో అవన్నీ కూడా ఆ రమావరుని స్వరూపమైన బాబాకు కూడా జరగాలన్నదే ఆమె ఏకాభిమతం.

అన్నింటికీ అతీతుడైన భగవంతునికి వీటన్నింటితో అవసరం లేదు. అందుకే బాబా వీటి పట్ల అలిప్తంగా ఉన్నారు. పైపెచ్చు ఆమె మాటతో బాబాకు వీటిని సమర్పించే భక్తులు ఏదో ఒక ఇహపరమైన ప్రత్యుపకారాన్ని ఆశించి చేస్తున్నారు. ఇది నిజమైన భక్తి కాదు అనేది దాసగణు యొక్క





దృఢాభిప్రాయం.

దాసగణు, రాధాకృష్ణాఆయి అభిమతాలను క్రోడీకరించి నిశితంగా పరిశీలించినట్లయితే వారిద్దరూ బాబా పట్ల మూలతః సమున్నతమైన భక్తి భావాన్ని కలిగియుండి, భిన్నమైన విధానాలలో భక్తిని వ్యక్తపరిచే పరస్పర విరుద్ధ స్వభావాలు కలిగిన వ్యక్తులుగా, ఎన్నటికీ కలవని ఉత్తర, దక్షిణ ధృవాలుగా మనకు గోచరమవుతారు. వారిద్దరి వైరుధ్య స్వభావం వలన ఒకరి భావాలతో ఇంకొకరు ఏకీభవించలేకపోవడం, ఒకరి పట్ల ఒకరికి అసహనం కలిగియుండటం సహజమే కదా! సరిగ్గా అలానే జరిగింది. వారిద్దరికి ఒకరంటే ఒకరికి సుతారాము గిట్టేది కాదు. ముఖ్యంగా దాసగణు ఆమె పట్ల కొంచెం పరుషమైన వాక్యాలు చేసేవాడు. ఆమె పైకి కనిపించేది ఒకటి, లోపల వాస్తవం ఇంకొకటి అనేది తన ఖచ్చితమైన అభిప్రాయం. శ్రీ సాయి వంటి వైరాగ్యభరితుడు, నీరీచ్ఛుడు అయిన మహానీయుని వద్ద ఆమె చేస్తున్నదంతా అనావశ్యకం అని దాసగణు తన అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తపరిచేవాడు. ఎలాగయినా విరోధించి ఆమెను నిరోధించాలని గట్టిగా నిర్ణయించుకొని, ఆ దిశగా ప్రయత్నం చేయడం మొదలుపెట్టాడు. అవతలి వారిలో తనకు నచ్చని గుణాలుంటే, వారు ఎంత వారయినా పది మందిలో వారిని పరిహసించడానికి దాసగణు వెనుకాడేవారు కారు అని మనం ముందర చెప్పుకున్నాం. తనలో స్వభావసిద్ధంగానున్న ఆ నైజాన్ని అనుసరించి, ఆమెను పరిహాసం చేస్తూ ఒక విమర్శనాత్మకమైన కావ్యాన్ని రచించాడు. అంతే, ఆ వార్త భక్తులందరికీ ప్రసరించింది. ఆ కారణంగా ఒకరిద్దరు భక్తులు దాసగణు వైపు, మిగిలిన భక్తులు రాధాకృష్ణాఆయి వైపు అలా ఇరువర్గాలుగా చీలిపోయారు. సమాజంలో పరపతి, గౌరవం కలిగిన పెద్దపెద్దవారంతా రాధాకృష్ణఆయి వైపు నిలబడ్డారు. కానీ, నానాసాహెబ్ చందోర్కర్ దాసగణుకు మద్దతుగా నిలిచాడు.

**(సశేషం)**



# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము

రచన : "రంగరాయ" బిరుదాంకిత శ్రీ మండువ రంగారావు

(గత సంచిక తరువాయి)

ఆ.వె. బ్రాహ్మణునిగ బుట్టి బ్రహ్మతేజమలర
పెరిగెనట ఫకీరు పెరటిలోన
ఆత్మనందు బ్రహ్మ యలరి యుండ
బ్రహ్మమయ్యె దాను బాబసాయి. 6

ఆ.వె. బాబ చలువ వలన భక్తులు మేల్గాంచె
అన్న వస్త్రములకు యార్తి లేక
రోగ రోష్టలన్ని రోసి దొలగె గాదె
సాయి చేతి మహిమ సాధనముల. 7

సీ. భక్తుల బాధలు భరియించి సాయియే
కష్టాలు దీర్చిన కరుణమూర్తి
భక్తుల రోగాలు బాబాయె పైబూని
వారికి శాంతిని వరలజేసె
కంసాలి బిడ్డడు కాలక కొలిమిన
ధునిలోన తనచేయి దూర్చె సాయి
బిడ్డను రక్షించి బిగువున భరియించె
తన చేతి బాధను తల్లిసాయి

ఆ.వె. కుష్టురోగిసేవ కోరి తాజేసెను
ప్లేగుబొబ్బ బొంది భీతి లేక
కాచె పిల్లవాని కాపర్ది కొడుకును
చింతజేసె పరుల చివరి దనుక. 8





తే.గీ. శిరిడి గ్రామాన గుడులన్ని శిథిలమవగ
సాయి చేయించె గుడులను చక్కగాను
శనియు, గణపతి, పార్వతి, శంభుడున్ను,
గ్రామ దేవత, హనుమల కరుణగురువ. 9

కం. కదలక మెదలక యుండును
పదనుగ నంతయు నెఱిగెడు పరమాత్మనోయ్
పదములబడియెను చందూ,
పదపదమని పండరికిని పయనము కాగాన్. 10

కం. సర్వజ్ఞుడు సాయీశుడు
సర్వాత్ముడు సకలలోక సంస్థితుడౌగా
సర్వుల రక్షించు నతడు
సర్వము తానైనవాడు సాయీశుండే. 11

## 14. జన్మలందు మనుజ జన్మ మేలు

తే.గీ. పాప పుణ్యాలు సరితూగ పావనులకు
మనుజ జన్మలు గల్గును మహిన యపుడు
పాప పుణ్యాలు యవగనె పరిసమాప్తి
సాధనంబున మోక్షంబు సాధ్యమగును. 1

తే.గీ. కర్మప్రారబ్ధములచేత గల్గు జన్మ
దేవ దానవ కిన్నెర జీవ గణము
లెవరికైనను మోక్షము లేదునొంద
సాధనార్హత మానవ జన్మ కగును. 2

కం. ఎనుబది నాలుగు లక్షలు
గణుతించగ గల్గుజన్మ గణముల లోనన్
జననము సఫలము నొందగ
కనవలె కార్యము పరులకు గలుగగ మేలున్. 3

తే.గీ. దేవ దానవ యక్షుల దేమి జన్మ?
మోక్ష మొందగ రాదట మొద్దు జన్మ
దాల్చి మానవ జన్మను ధరణియందు
మోక్షమందగ వీలగు మోదమమర. 4

ఆ.వె. దేవ యక్షులున్న దేవుని ప్రార్థించు
మానవుని బుట్టి మనగ నిలను
సాధనములజేసి సాధించ మోక్షంబు
జన్మ లందు మనుజ జన్మమేలు. 5

ఆ.వె. పరుల మేలు దలుప బరగును పుణ్యాన
పరుల కీడు జేయ పాపమలరు
పాప పుణ్యములకు ఫలితంబు నీ జన్మ
సఫల మగును జన్మ సాధుజనుల. 6

తే.గీ. పాపపుణ్యాలు గుడువగ పయన మగును
నరక దివిసీమ జేరగ మరల మరల
పాప పుణ్యాలు క్షీణించవచ్చు నిటకు
మర్త్యలోకాన మరియొక్క మనుజ జన్మ. 7

**(సశేషం)**





# మాతృసంస్థ కబుర్లు

ఆగస్టు 20-కృష్ణాష్టమి. సాయిధామం ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ బహుళ అష్టమి రోజున రోహిణీ నక్షత్రంలో కృష్ణుడు జన్మించాడు. తన లీలలతో భక్తి, జ్ఞానం, యోగం, మోక్షం గురించి మానవాళికి సందేశం ఇచ్చారు. నల్లనయ్య కృష్ణాష్టమినే గోకులాష్టమి అంటారు.

శ్రీ సాయి విద్యాధామం పాఠశాలలో అన్నపూర్ణ హాలులో శ్రీకృష్ణుని మంటపం పెట్టి ఎంతో సుందరంగా అలంకరణ కావించి, చిన్ని చిన్ని కృష్ణ పాదాలు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయి. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు గోపికా కృష్ణులుగా అలంకరణ చేసుకుని అందరినీ ఆకట్టుకున్నారు. ఉదయం 10.00 గం.లకు గురుదేవుల ఆధ్వర్యంలో భక్తులు, విద్యార్థులు కృష్ణపూజను చేసుకుని, కృష్ణుని యొక్క తత్వాన్ని శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారు వివరించారు.

ఇదేరోజు పూజ్య మాతాజీ 6వ పుణ్యతిథి కావడంతో అమ్మకి కూడా పూజా కార్యక్రమం జరిగింది. ఎంతోమంది విద్యార్థులకు జ్ఞానభిక్ష ప్రసాదించిన మాతాజీ సేవలు చిరస్మరణీయం. అజ్ఞాన తిమిరంలో కొట్టు మిట్టాడుతున్న ఆత్మబంధువులకు జ్ఞాన వెలుగులు చూపించి సాయిధామం సేవాశ్రమాలకు ధర్మాధికారిగా వ్యవహరించి తల్లిలా దీనదుఃఖితులను ఆదరించిన పుణ్యశాలి. గొప్పవారి అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయాలను నెరవేర్చడమే మనం వారికి ఇచ్చే ఘనమైన నివాళి. పూజ్య మాతాజీ పేర పాఠశాల ఉపాధ్యాయులకు ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా వస్త్రదానం చేయడం జరిగింది. 12 గం.లకు పాఠశాల విద్యార్థినులు కృష్ణుని సంబంధించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందోత్సాహాలతో జరిగాయి.

మధ్యాహ్నం గం.2.00లకు ఉట్టికొట్టే కార్యక్రమం జరిగింది. చిన్న తనంలో గోపాలకృష్ణుడు ఉట్టిపై దాచిన వెన్నకుండలను పగులగొట్టి దాన్ని గోపబాలికలకు పంచిపెట్టేవాడు. నలుగురితో పంచుకోవడంలో ఉన్న ఆనందం ఏమిటో లోకానికి చాటిచెప్పాడు. దాన్ని స్మరించుటకే ఉట్టికొడతారు. పాలు, పెరుగు, వెన్న, అటుకులు, పళ్లులాంటి పదార్థాలు ఉంచిన ఈ ఉట్టిని కొడతారు. సాయి విద్యాధామం విద్యార్థులు ఉట్టి కార్యక్రమం ఆద్యంతం అత్యంత ఆనందాతోత్సాహాలతో జరిగింది. సాయంత్రం గం.4.00లకు పాఠశాల విద్యార్థులందరికీ పులిహోర, రవ్వకేసరి స్వీటు ప్రసాదంగా పెట్టడం జరిగింది.

ఆగస్టు 31-వినాయక చవితి. విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడు. భాద్రపద మాసం శుక్ల చవితినే వినాయక చవితి అంటారు. సాయిధామం ఆశ్రమంలో రెండు రోజుల ముందునుంచే వినాయక ఉత్సవ హడావిడి మొదలయ్యింది. విగ్రహాన్ని తీసుకురావడం, చక్కని వినాయక మంటపాన్ని ఏర్పాటు చేయడం, 21 రకాల పత్రినీ సేకరించడం, పిల్లలందరూ వాళ్లకు నచ్చిన విధంగా రకరకాల బొజ్జ గణపయ్యలను తయారుచేసుకొని చక్కగా అలంకరించుకున్నారు. 31 ఉదయమే ప్రత్యుష భవనం అంతా రంగవల్లికలతో మండపం రంగుల పుష్పాలతో అలంకరించి స్వామి వారిని ఆశీనులను కావించారు. 11 రకాల నివేదనలతో స్వామికి పూజ మొదలయ్యింది. శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు మంత్రోచ్ఛారణ చేస్తుండగా పిల్లలంతా శాస్త్రోక్తంగా పూజ చేసారు. వినాయక వ్రత కథను, గణాలకు అధిపతి ఎలా అయ్యారు, ఈ మాసంలోనే ఎందుకు చేసుకుంటాము, గరికతో ఎందుకు పూజ చేయాలో సవివరంగా వివరించారు. వినాయకుడిని పూజించే పత్రాలన్నీ కూడా ఔషధ గుణాలు కలిగినవి. వీటి ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు. వీటన్నింటిలో గరిక శ్రేష్ఠమైనది. ఇది చర్మవ్యాధులను నివారిస్తుంది. స్వామి నామావళితో ప్రత్యేకంగా అర్చిస్తారు. ప్రకృతిలో లభించే పత్రాలను సేకరించి భక్తితో అర్చిస్తే





సంతోషిస్తారు బొజ్జ గణపయ్య అని చెప్పారు. శ్లోకాలు, భజనలు అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు అందరూ.

సెప్టెంబర్ 2న సాయిధామం పరిసర గ్రామమైన అంకిరెడ్డిపల్లిలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా వినాయక తత్వం, మన సనాతన సాంప్రదాయాలను మనకు ఏ విధంగా ఉపయోగపడతాయో అనే విషయాలపైన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు “శివాజీ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్” తరపున గ్రామస్తులకు ఉపన్యాసం ఇచ్చారు. స్వామీజీ ఉపన్యాసానికి గ్రామస్తులంతా ఎంతో భక్తిని, ఆనందాన్ని వెలిబుచ్చారు.

సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన గురువు. జాతి గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన మన దేశ రెండో రాష్ట్రపతి, మేధావి, విద్యావేత్త అయిన డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా గుర్తించారు.

ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యాధామం పాఠశాల 10వ తరగతి విద్యార్థులందరూ ఉపాధ్యాయుల పాత్రను పోషించి వారి వారి అనుభవాలను చక్కగా వివరించారు. ఉపాధ్యాయ పాత్ర ఎంతో బాధ్యతతో కూడుకున్నదనీ, బరువైనదనీ, మనలో ఎంతో జ్ఞానం ఉంటే తప్ప బోధించలేమని వివరించారు. చివరగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ మాట్లాడుతూ దేవుడు, గురువు ఒకసారి ప్రత్యక్షమైతే నేను మొదటగా గురువుకే నమస్కరిస్తా అన్నారు మహానుభావుడు కబీర్‌దాసు. ఎందుకంటే ఆయన భగవంతుడు అని మొదట తనకు చెప్పింది గురువే కాబట్టి అని వివరించారు. సమాజంలో గురువుకు ఉన్న స్థానం అంత గొప్పది. ‘గు’ అంటే చీకటి, ‘రు’ అంటే పోగొట్టేది అని అర్థం. అంటే మనలో అజ్ఞాన పొరలు తొలగించి జ్ఞానదీప్తిని వెలిగించేవారు గురువులన్నమాట. అలాంటి గురువులను దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది అని సెలవిచ్చారు.